: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

చాళుక్య ద్వారము
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ADIKAVI NANNAYA UNIVERSITY
For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్
Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య కె.పద్మరాజు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వుల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 37 | 12-06-2023 | పుటలు : 4

## పర్యావరణ హితంగా జీవించాలి

**05.06.23 (మీడియాసెల్)**

అందరూ పర్యావరణాన్ని పరిరక్షిస్తూ, పర్యావరణ హితంగా జీవించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ కడియం నర్సరీస్ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీ ఎదురుగా వీసీ ఆచార్య కె.పద్మరాజు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అందరూ కాలుష్యానికి దూరంగా పర్యావరణానికి దగ్గరగా జీవించాలని అన్నారు. పర్యావరణ దినోత్సవ ముఖ్య ఉద్దేశాలను, మిషన్ లైఫ్ వంటి నినాదాలను గురించి వివరించారు. మన అభివృద్ధి పర్యావరణానికి ఆటంకంగా మారకూడదన్నారు. విద్యార్థులు పర్యావరణ కాలుష్య నియంత్రనకు పూనుకోవాలని, తద్వారా భవిష్యత్ తరాలకు మంచి జీవితాలను అందించగలమన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పచ్చని ప్రకృతి ఒడిలో ఉండటం ఎంతో ఆనందంగా ఉందని, ప్రకృతి వాతావరణాన్ని మరింత పెంపొందించాలన్నారు. ఆహారాన్ని, కరెంట్ ను, నీటిని వృధా చేయొద్దని విద్యార్థులకు సూచించారు. తండ్రి కూతురికి అన్ని ఇచ్చి ప్రేమించి, పరిరక్షించనట్లు మనం జీవిస్తున్న భూమిని కూతురుగా భావించాలని అన్నారు. నూతన ఆలోచనలతో, సేవాదృక్పధాలతో, పర్యావరణ హితంగా జీవిస్తూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అలాగే కడియం పూల మార్కెట్ లో టన్నుల కొలదీ వేస్ట్ అవుతున్న పువ్వులను రీసైకిల్ చేయాలని రోటరీ క్లబ్ ఆఫ్ కడియం నర్సరీస్ ప్రెసిడెంట్ సింగంశెట్టి శ్రీనివాసరావు సూచనలను వీసీ ప్రశంసించి దానికి తగిన ప్రణాళికను రూపొందించాలని ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా.కె.రమణేశ్వరికి సూచించారు. 50 మొక్కలను విశ్వవిద్యాలయానికి బహూకరించిన రోటరీ క్లబ్ ఆఫ్ కడియం నర్సరీస్ వారిని రిజిస్ట్రార్ అభినందించారు. అనంతరం రోటరీ క్లబ్ ఆఫ్ కడియం నర్సరీస్ ప్రెసిడెంట్ సింగంశెట్టి శ్రీనివాసరావు, సెక్రటరీ పతంశెట్టి శేషుకుమార్ లకు జ్ఞాపికలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా.కె.రమణేశ్వరి, ప్రిన్సిపాల్స్, డీన్స్, విశ్వవిద్యాలయ అధికారులు, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నన్నయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న వీసీ పద్మరాజు

## ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించండి





ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ వ్యర్థాలు పెను ప్రమాదాలకు కారణాలు అవుతున్నాయని, విద్యార్థులు ప్లాస్టిక్ ను క్రమంగా తగ్గించాలని వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు.ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మరియు ఎన్.ఎస్.ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా "ప్లాస్టిక్ ఫ్రీ క్యాంపస్ ప్రోగ్రామ్" ను వారం రోజుల పాటు నిర్వహిస్తున్నారు. పర్యావరణ దినోత్సవం రోజు ప్రారంభమైన ఈ ప్రోగ్రామ్ వారం రోజుల పాటు క్యాంపస్ లోని ఒక్కొక్క భవన పరిసరాలలో నిర్వహించనున్నారు. ఆయా ప్రాంతాలలోని ప్లాస్టిక్ వ్యర్థాలను తీసివేసి, ప్లాస్టిక్ రహిత క్యాంపస్ గా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వీసీ ఆచార్య కె.పద్మరాజు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులంతా ఎన్.ఎస్.ఎస్ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. విద్యార్థులకు ఎన్.ఎస్.ఎస్ ద్వారా సేవాదృక్పధాలు అలవాటవుతాయని, సమాజ పరిస్థితులపై అవగాహన కలుగుతుందన్నారు. గోదావరి జిల్లాల్లోని తుఫాను, వరదలు సమయంలో ఎన్.ఎస్.ఎస్ తరుపున తాను చేసిన కార్యక్రమాలను ఉదాహరిస్తూ విద్యార్థులలో స్ఫూర్తిని నింపారు. విశ్వవిద్యాలయ క్యాంపస్ వాతావరణాన్ని అందంగా, ఆహ్లాదకరంగా ఉంచాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల ద్వారా ఎన్నో అనర్థాలు సంభవిస్తున్నాయని తెలిపారు. భూమిపై, నీటిలో 20 శాతం జీవజాతులు ప్లాస్టిక్ వంటి వ్యర్థాల కారణంగా మరణిస్తున్నాయని చెప్పారు. మానవ ఆరోగ్యానికి ముప్పుగా మారిన ప్లాస్టిక్ ను నిషేధించి క్లాత్ బ్యాగ్స్ ఉపయోగించాలని తెలియజేసారు. విద్యార్థులు అవగాహన పెంచుకొని సమాజాన్ని చైతన్యం చేయాలన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా "ప్లాస్టిక్ కాలుష్యానికి పరిష్కారాలు" అనే అంశంతో ప్రపంచ వ్యాప్తంగా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. దీనిలో భాగంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఏడు రోజుల ప్లాస్టిక్ వ్యర్థాలు తీసివేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సైన్స్ కాలేజ్, ఎన్.ఎస్.ఎస్ విభాగాలను వీసీ అభినందించారు. సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డా.పి.విజయనిర్మల మాట్లాడుతూ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ ఫ్రీ క్యాంపస్ ప్రోగ్రామ్ ను వారం రోజుల పాటు ఎన్.ఎస్.ఎస్ 1,2,3 విభాగాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం ఎన్ బ్లాక్, మంగళవారం అడ్మిన్ బ్లాక్, బుధవారం, ఎన్.టి.ఆర్.కన్వెన్షన్ సెంటర్, గురువారం డా.అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీ, శుక్రవారం అమినిటీస్ బిల్డింగ్, శనివారం బాయ్స్ హాస్టల్, ఆదివారం గర్ల్స్ హాస్టల్ వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేస్తారని చెప్పారు. కార్యక్రమాలను ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డా.ఎస్.రాజ్యలక్ష్మి, డా.ఎల్.ముత్యాలనాయుడు, డా.డి.ప్రకాష్ లు పర్యవేక్షణలో జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ డా.పి.వెంకటేశ్వరరావు, డీన్స్ ఆచార్య కె. రమేష్, ఆచార్య పి. శ్రీనివాసరావు, డా.ఎ.మట్టారెడ్డి, ఆచార్య కె.రమణేశ్వరి,ఆచార్య టి.జ్యోతిర్మయి, ఈసీ మెంబర్ డా.బి. జగన్మోహన్ రెడ్డి, డా.వి.పెర్సిస్, డా. పి. ఉదయ్ భాస్కర్, డా. దీప్తి, డా.కె.రేవతి, డా.ఎం.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# సంపాదకీయం



# మానస వికాసం

మానవ వికాసానికి ఆధారమైంది విద్య మాత్రమే. అది మనిషిలో నిక్షిప్తంగా ఉన్న సమగ్రతను బయటకు తీస్తుంది. విద్య జీవితాంతం కొనసాగే నిరంతర ప్రక్రియ. తన చుట్టూ ఉన్న పరిసరాల మీద మనిషి ఆధిపత్యం సంపాదించటానికి అవసరమైన శిక్షణను అవకాశాన్ని మెదడుకు అందిస్తుంది. మనిషిలో ఒక అద్వితీయ శక్తి కేంద్రం ఉంది. జ్ఞాపకం, భాష మనిషికి లభించిన వరాలు. వాటి వల్లనే మానవత్వ బాధ్యతలు ఏర్పడ్డాయి. నైతిక విలువలు, సౌందర్య దృష్టి, సానుభూతి, సేవాభావం, ధార్మికమైన ఆలోచనలు, అంకిత భావం, కలిసి పనిచేసే తత్వం ఇవన్నీ ఏర్పడ్డాయి. విద్య ద్వారానే మనిషికి ఆధ్యాత్మిక వికాసం కూడా లభిస్తుంది.

విజ్ఞాన నైపుణ్యాలు విద్యాశిక్షణ వల్ల కలిగితే ఆధ్యాత్మిక భావన వల్ల ఆత్మ వికాసం కలుగుతుంది. ఇతర ప్రాణుల నుంచి మనిషిని వేరు చేసిన లక్షణాలు ఇవే. త్యాగం, సేవ వంటి వాటి వల్ల సమాజంలో ఇతరులతో మనిషి మమేకం కాగలుగుతున్నాడు. పరస్పర సహకారం, ప్రేమానురాగాల వల్లనే భావ వినిమయం జరిగి సమాజానికి పనికి వచ్చే మనిషి అవుతాడు.

కేవలం వ్యక్తిగతమైన శక్తిని సంపాదిస్తే సరిపోదంటారు బెర్ట్రెండ్ రసెల్. సమాజంలోని ఇతర సభ్యులతో కలసి శాంతియుతంగా జీవించే శక్తి కావాలంటే మనిషి నిరంతరం వికాసం చెందాలంటారాయన.

మానవ వికాసం అంటే చుట్టూ ఉన్న పరిస్థితులకు స్పందించే హృదయంగా బ్రతకగలగటం. 'తనపై తాను విజయం సాధించలేనివాడు నిజానికి ఎంత పేదవాడు' అంటారు వర్డ్స్ వర్త్. విజ్ఞానం వివేకం స్థాయికి ఎదిగినప్పుడే మనిషి పరిపూర్ణుడవుతున్నాడు. తరగతి గదులు ఇవాళ అందిస్తున్న విజ్ఞానమంతా మానవ సాఫల్యానికి సమాజాభివృద్ధికి బలమైన శక్తులుగా మనుషులు రూపొందటానికే. కేవలం వైయక్తిక ప్రయోజనాల కోసమే అయితే అది స్వార్థమే అవుతుంది.

ఒక బాధ్యత చుట్టూ సేవ కూడా నిండి ఉంది. ఒకవేళ అహంకారమే నిండి ఉంటే ఆ చదువు వృథా. అంతేకాదు నష్టం కూడా.

విజ్ఞానంతో పాటు సంస్కృతి, వారసత్వ విషయాల్ని అందించాల్సిన బాధ్యత బోధనలో ఉంది. విజ్ఞానంతో మానవతావాదాన్ని రంగరించాలనే ప్రాథమిక సూత్రాన్ని విద్యావిధానంలో బోధకులు మర్చిపోకూడదు. విజ్ఞానం మానవతావాదం ఏ దేశంలోనైనా జాతీయ సంప్రదాయానికి ప్రాథమిక శక్తులు. తన హృదయంలో ఇతరులకు చోటిచ్చి ఇతరుల హృదయాల్లో తాను చోటు సంపాదించుకునే సామర్థ్యం, మానవ సంబంధాలు మనిషి సొంతం. ఇది పూర్తిగా సంస్కృతి ద్వారా మాత్రమే లభిస్తుంది.

విజ్ఞాన, విద్యా శిక్షణలతో పాటుగా సంస్కృతి,వారసత్వాలను బోధించడం ద్వారా విద్యార్థి మానసిక వికాసం తేజోవంతమవుతుంది. మానవ వికాసమే జాతి,దేశ వికాసాలు అనేది ముఖ్యమైన విషయంగా గమనించాలి. ఆ దిశగా బోధన చర్యలు ఉండాలి.

## గూడెం క్యాంపస్ ను విజిట్ చేసిన వీసీ ఆచార్య పద్మరాజు

**05.06.23 (మీడియా సెల్)**

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం క్యాంపస్ ను వీసీ ఆచార్య కె.పద్మరాజు సోమవారం విజిట్ చేసారు. క్యాంపస్ ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీరమేష్ వీసీ పద్మరాజుకు ఘనస్వాగతం పలికారు. గూడెం క్యాంపస్ చరిత్రను, వనరులు, వసతులు వంటి వివరాలను ప్రిన్సిపాల్ వివరించారు.తరువాత క్యాంపస్ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకాన్ని విద్యార్థులకు తెలియజేసారు. క్యాంపస్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులతో వీసీ మాట్లాడారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని అన్నారు. తాడేపల్లిగూడెం క్యాంపస్ ప్రగతికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో అధ్యాపక బృందం నిమగ్నమై ఉండాలన్నారు. విద్యార్థులు విద్యతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.






## కాకినాడ క్యాంపస్ లో పర్యావరణ దినోత్సవ వేడుకలు

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడ నందు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో క్యాంపస్ ప్రిన్సిపల్ డా. ఎం.కమలకుమారి ముఖ్యఅతిథిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ " యునైటెడ్ నేషన్స్ వారు జూన్ 5వ తేదీని ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా ప్రకటించారు దీని యొక్క ముఖ్య ఉద్దేశం ప్రతి మానవాళి ప్రకృతి పట్ల ప్రేమను మరియు అవగాహనను కలిగి ప్రపంచ పర్యావరణాన్ని వివిధ రకాల కాలుష్యాల నుండి ప్లాస్టిక్ వ్యర్థాల నుండి మానవాళి తోపాటు ఇతర జీవచరాలను రక్షించడానికి అవగాహన కోసం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ఎస్-ఎస్ ఆధ్వర్యంలో ఈ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం నిజంగా హర్షదాయకం అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డా. ఎం. పోచయ్య, ఎన్ఎస్ఎస్ అధికారులు డా. ఎం. శ్రీదేవి డా. ఎం. నానిబాబు అధ్యాపకులు డా.అప్పారావు, డా. శ్రీరామరాజు, డా.గోపి, డా.హరిబాబు, రధామాధవి, హేమలత, దుర్గా భవాని, బోధన బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




## డా.మద్దా సత్యనారాయణ కుటుంబానికి ఆర్థిక సహాయం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ కాకినాడలోని పొలిటికల్ సైన్స్ అధ్యాపకునిగా పని చేస్తూ ఇటీవల మృతి చెందిన డా.మద్దా సత్యనారాయణ కుటుంబానికి విశ్వవిద్యాలయం తరుపున ఆర్థిక సహాయాన్ని వీసీ ఆచార్య కె.పద్మరాజు అందజేసారు. యూనివర్సిటీ వీసీ కార్యాలయంలో సత్యనారాయణ కుటుంబ సభ్యులకు వీసీ చెక్కులను అందజేసి, ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కాకినాడ క్యాంపస్ లో సుమారు రెండు దశాబ్దాలకు పైగా పొలిటికల్ సైన్స్ అధ్యాపకునిగా డా.మద్దా సత్యనారాయణ విశేష సేవలు అందించారని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులర్పించారు. సత్యనారాయణ కుటుంబానికి నన్నయ విశ్వవిద్యాలయం తరుపున రెండు లక్షల రూపాయల చెక్కును, విశ్వవిద్యాలయ అధ్యాపక సిబ్బంది తరుపున రూ. 1.7 లక్షల చెక్కును ఆర్థిక సహాయంగా అందజేసామని చెప్పారు. ఇటీవల కాకినాడ ఎం.ఎస్.ఎన్. క్యాంపస్ సిబ్బంది తరుపున రూ. 81 వేలు ఇచ్చారని తెలిపారు. సత్యనారాయణ కుటుంబానికి నన్నయ విశ్వవిద్యాలయం సహకారంగా ఉంటుందని భరోసాను కల్పించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, క్యాంపస్ ప్రిన్సిపాల్ డా.ఎం.కమలకుమారి, సత్యనారాయణ భార్య జ్యోతి, కుమారులు, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



సత్యనారాయణ కుటుంబ సభ్యులకు చెక్కులు అందజేస్తున్న వీసీ

# నన్నయలో జాబ్ మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న జక్కంపూడి రాజా

**09.06.23 (మీడియాసెల్)**


ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రనైపుణ్యాభివృద్ధిసంస్థ ఆధ్వరంలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన వచ్చింది. శుక్రవారం యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో ఏర్పాటు చేసిన ఏ.పి,ఎస్.ఎస్.డి.సి జాబ్ మేళా ప్రోరంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, వీసీ ఆచార్య కె.పద్మరాజు, ఏ.పి.ఎస్.ఎస్.డి.సి జిల్లా అధికారి కొండలరావు హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ ఎక్కువ ఉద్యోగాలు ఉన్నప్పటికీ దానికి అవసరమైన స్కిల్స్ లేకపోవడం ద్వారానే నిరుద్యోగ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించేందుకు అనేక కార్యక్రమాలను తీసుకువచ్చారన్నారు. ప్రస్తుతం విద్యతో పాటు స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్, ఇంటర్న్ షిప్ లను ప్రవేశపెట్టి విద్యార్థులకు నైపుణ్యాలను మెరుగుపరుస్తున్నామన్నారు. విశ్వవిద్యాలయంలో నూతన నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని, విద్యార్థులకు విద్యతో పాటు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. అందరి సహకారంతో విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలియజేసారు. జాబ్ మేళా ద్వారా ఉద్యోగం పొందిన విద్యార్థులు చక్కని నైపుణ్యాలను, ఉద్యోగ అనుభవాలను పెంపొందించుకోవాలన్నారు. ఉన్న స్థానం నుండి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. యువత ఎక్కువగా ఉన్న భారతదేశంలో, యువతరాన్ని సమర్ధవంతంగా ఉపయోగించుకుంటే దేశాభివృద్ధికి మంచి ఫలితాలు వస్తాయన్నారు. విశ్వవిద్యాలయంలో చక్కని కార్యక్రమాన్ని నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రనైపుణ్యాభివృద్ధిసంస్థ వారికి, ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు అభినందనలు తెలియజేసారు. జాబ్ మేళాకు 673 మంది హాజరయ్యారని ఎక్కువ మందికి అవకాశాలు కల్పించాలని కంపెనీల హెచ్.ఆర్ లను వీసీ కోరారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నూతన వీసీ గా బాధ్యతలు స్వీకరించిన వీసీ ఆచార్య కె.పద్మరాజుకు శుభాకాంక్షలను తెలియజేసారు. ఆంధ్రప్రదేశ్ లోనే ఎక్కువ అనుబంధ కళాశాలలతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పెద్ద విశ్వవిద్యాలయంగా ఉందన్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని వేలాది మంది విద్యార్థుల భవిష్యత్ నన్నయతో ముడిపడి ఉందని చెప్పారు. దివంగతనేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి, జక్కంపూడి రామ్మోహనరావు కృషి ఫలితంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరంలో ఏర్పాటు అయిందన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కె.పద్మరాజు నాయకత్వంలో అభివృద్ధి చెందుతుందని పరిపూర్ణంగా విశ్వసిస్తున్నాని అన్నారు. దానికి తగిన సహాయ సహకారాలను ప్రభుత్వం నుండి తాము అందిస్తామన్నారు. ఆయా సంస్థలకు అవసరమైన నైపుణ్యాలను ఇంటర్న్ షిఫ్ లతో అందజేస్తున్నారని, స్కిల్ డెవలప్మెంట్ కాలేజ్ లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం బాధ్యతగా చేపట్టనుందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న నైపుణ్యాలను, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏ పీ ఎస్ ఎస్ డి సి ఆధ్వర్యంలో అతిథులను సన్మానించి అభినందనలు తెలియజేసారు. తరువాత జాబ్ మేళాలో ప్రముఖ మిరాకిల్ సాఫ్ట్వేర్ సిస్టమ్స్, టిసిఎల్, యాయిఎరో గ్లోబల్ టెక్నోలాజిస్, జీ ఎస్ ఎల్, ఆటోమోటివ్ మన్యాఫ్కచురర్, కాలిబ్ హెచ్ఆర్, పే టి ఎమ్, వరుణ్ మోటార్స్, ఇండియన్ డైరీ ఎక్విప్మెంట్ అండ్ ఫ్యాబ్రి కేటర్స్, ముతూట్ ఫైనాన్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, అపోలో ఫార్మసీ, బి ఎస్ బి టెక్నోలాజిస్,నైపుణ్య భారత్ ఇన్నొవేషన్స మారియు మెడ్ ప్లస్ వంటి 15 కంపెనీలు ఆయా విభాగాలలో విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ కనపరచినవారిని ఎంపిక చేసారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్లేస్మెంట్ కోఆర్డినేటర్ డా.బి.జగన్మోహనరెడ్డి, ఏపీ ఎస్ ఎస్ డి సి అధికారులు కొండలరావు, ఎ. ఎస్. ఆర్ మూర్తి, రాజానగరం జడ్పిటిసి వాసంశెట్టి పెద్ద వెంకన్న,కోరుకొండ జడ్పిటిసి కర్రి నాగేశ్వరరావు,జిల్లా సేవాదళ్ అధ్యక్షులు డాక్టర్ బాబు, మందారపు వీర్రాజు,కోరుకొండ మండల సర్పంచ్ సమైక్య సంఘ అధ్యక్షులు కర్రి పాపారావు, ప్రగడ చక్రి తదితరులు పాల్గొన్నారు.





## నన్నయ భారతికి గ్రంథబహూకరణ

రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త,కవి డా. బులుసు వేంకట సత్యనారాయణ మూర్తి తెలుగు, సంస్కృత, ఆంగ్ల, కన్నడ గ్రంథాలతో కూడిన విలువైన తమ గృహ గ్రంథాలయాన్ని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని నన్నయ భారతి డొనేటెడ్ విభాగానికి సమర్పించారని వీసి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. సాహిత్య విద్యార్థులకు పరిశోధకులకు ఉపయోగపడే గ్రంథాలను అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తన గ్రంథాలు విశ్వవిద్యాలయంలో ఉంటే సాహిత్య విద్యార్థులు, పరిశోధక విద్యార్థులకు అవి ఉపయోగపడతాయని తాను భావిస్తున్నానని బివిఎస్ మూర్తి అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ద్వారా అన్ని రంగాల్లో మంచి పరిశోధనలు వెలువడాలని ఆకాంక్షించారు. విలువైన తన గ్రంథాలను నన్నయ భారతి కోఆర్డినేటర్ డా.తలారి వాసుకి అందజేశారు.విశ్వవిద్యాలయం తరపున శాలువా, జ్ఞాపికతో డా.బీవీఎస్ మూర్తిని వాసు సత్కరించారు.సుమారు 1500 గ్రంథాలను అందించారని అరుదైన గ్రంథాలు అందులో ఉన్నాయని,పరిశోధకులకు ఉపయోగపడతాయని వాసు అన్నారు.





### మంచిమాట

విలువలతో కూడిన విద్య, సంస్కారం నేర్పే గురువులు, సంస్కృతిని అలవర్చే తల్లిదండ్రులు, మంచి వైపునకు నడిపించే స్నేహితులు ఉంటే... ఏ వ్యక్తి జీవితమైనా ఉన్నత శిఖరాలకు చేరుతుంది.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి 36వ ఫౌండేషన్ డే కార్యక్రమానికి హాజరైన ఉన్నతాధికారులు.నన్నయ వీసి ఆచార్య పద్మరాజు.

# ప్రముఖులను కలిసిన వీసీ పద్మరాజు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య కె పద్మరాజు ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిశారు.


కొట్టు సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి


జె. శ్యామలరావు ఐఏఎస్., ప్రిన్సిపల్ సెక్రటరీ, హయ్యర్ ఎడ్యుకేషన్


హర్షవర్ధన్ ఐఏఎస్., ఎండి ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ

# వీసీకి శుభాకాంక్షలు తెలిపిన పలువురు ప్రముఖులు


ఏ ఎస్ ఎన్ మూర్తి, ప్రిన్సిపాల్, శ్రీప్రకాష్ విద్యానికేతన్


ఎస్.పి రెడ్డి, ఎక్సక్యూటివ్ డైరెక్టర్


ఎమ్. వేణుగోపాల్, టాలెంట్ షైన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్


సత్యనారాయణ, ఫార్మర్ ఫైనాన్స్ ఆఫీసర్


రాంకుమార్ రాందేవ్, స్టార్టప్ మెంటార్


సూరవరపు శ్రీనివాస్ కుమార్, అభయ కన్స్ట్రక్షన్స్


డా. సంగీత, ప్రిన్సిపాల్
పి ఎస్ ఆర్ లా కాలేజ్

# జూన్ 12 "ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం"




ప్రతి ఏడాది జూన్ 12న "ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం"ను జరుపుకుంటున్నాము. బాల కార్మికులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవడానికి, బాలలను పనిలో కాకుండా బడిలో చేర్పించేందుకు, వారికి మంచి పౌష్టికాహారాన్ని అందివ్వడానికి ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ కార్మికసంస్థ ఆధ్వర్యంలో ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము.

ప్రపంచవ్యాప్తంగా 15.2 మిలియన్ల మంది బాల కార్మికులు ఉన్నారని, అందులో 7.2 మిలియన్ల మంది ప్రమాదకరమైన పనుల్లో పనిచేస్తున్నారని అంచనా. బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా అంతర్జాతీయ మద్దతు కూడగట్టే ఉద్దేశంతో 2002 జూన్ 12న 180 దేశాల దేశాల మద్దతుతో ఈ దినోత్సవాన్ని ప్రారంభించింది. దీని కోసం అన్ని దేశాల ప్రభుత్వాలు అధికారులు, అంతర్జాతీయ సంస్థలు బాల కార్మికులకు సామాజిక భరోసాని అందివ్వడానికి కృషి చేస్తున్నాయి. బాలకార్మికులుగా మారడానికి ప్రధాన ఉద్దేశం పేదరికం మరియు చేరదీసేవారు లేకపోవడం. దీనితో గత్యంతరం లేని పరిస్థితుల్లో పనికి వెళ్తున్నారు. కుటుంబపోషణ కోసం కొందరు తల్లిదండ్రులు వ్యవసాయం లోనూ, కర్మాగారాల్లోనూ, దుకాణాల్లోనూ పిల్లలకు పనికి పంపుతున్నారు. కొందరు అనాధ పిల్లలను మాదగ్రద్రవ్యాల వినియోగానికి, పిల్లల అక్రమ రవాణాకి, నిషేధిత కర్మాగారాల్లో పనికి ఉపయోగించుకుంటున్నారు. ఈ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన జరగాలంటే ముందుగా తల్లిదండ్రుల్లో మార్పు తీసుకురావాలి. వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలి. పిల్లలకు అందమైన బాల్యాన్ని కానుకగా ఇవ్వాలి.

భారతదేశంలో బాలకార్మిక వ్యవస్థకు ఎన్నో చట్టాలు ఉన్నా సరే ఈ వ్యవస్థ నిర్మూలన జరగడం లేదు. రాజ్యాంగంలోని 24 ఆర్టికల్ తో పాటు ద ఫ్యాక్టరీస్ యాక్ట్ 1948, చైల్డ్ లేబర్ యాక్ట్ 1986, ద జువైనల్ జస్టిస్ ఆఫ్ చిల్డ్రన్స్ యాక్ట్ 2000, రైట్ టు చిల్డ్రన్ ఫ్రీ ఎడ్యుకేషన్ యాక్ట్ 2009 వంటి చట్టాలు బాల కార్మిక నిర్మూలన వ్యవస్థకు కృషి చేస్తున్నాయి.

సమాజంలో మార్పు తీసుకురావడానికి ప్రభుత్వంతో పాటు మన వంతుగా మనం కృషి చేస్తే బాలకార్మిక వ్యవస్థ లేని సమాజం సాధ్యమవుతుంది. ఎందుకంటే నేటి బాలలే రేపటి పౌరులు కదా.

**బి.సుశాంత్ కుమార్**